

కొత్తమ్మతల్లి ఉత్సవాలకు సన్నద్ధం కావాలి

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

కొత్తమ్మతల్లి ఉత్సవాలను రాష్ట్ర పండగగా రెండో ఏడాది నిర్వహిస్తున్న నేపథ్యంలో అధికారులు సన్నద్ధం కావాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అమరావతిలోని సచివాలయం నుంచి జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సూచనలు చేశారు. ఆలయ ఉత్సవాలకు వందేళ్లు పూర్తవుతుండడంతో అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి యాత్రికులు వచ్చే అవకాశాలున్నాయని, అందుకనుగుణంగా క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి లోపాలూ తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ప్రజల మన్ననలు పొందేలా అధికారులు క్షేత్రస్థాయిలో అంకితభావంతో పనిచేయాలన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

- గ్రామాల్లో తీవ్ర అపారిశుధ్య పరిస్థితులు
- కాలువల్లో పేరుకుపోయిన పూడిక
- అంతంతమాత్రంగానే ఆర్థిక సంఘం నిధులు విడుదల
- అపారిశుధ్య పరిస్థితులతో పెరుగుతున్న జ్వర పీడితులు



ఎచ్చెర్ల : ఎస్‌ఎం పురంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో గ్రామాల్లో తీవ్ర అపారిశుధ్య పరిస్థితులు నెలకొన్నాయి. పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు ఇటీవల కాలం వరకు పైసా డబ్బులేక కటకటలాడాయి. మరోవైపు సీజనల్ జ్వరాలు సోకుతుండడంతో, పంచాయతీ కార్యదర్శులు తమ చేతి డబ్బులను మదుపు పెట్టి కొంతమేర పనులు చేయించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసినా, అవి ఎందుకూ చాలని పరిస్థితి నెలకొంది. పంచాయతీల్లో నెలకొన్న అపారిశుధ్య పరిస్థితులను బట్టి డబ్బులను కేటాయించి ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు వస్తే తప్ప పనులు ముందుకు సాగని పరిస్థితి ఉంటోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కనీస సాయం కొరవడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 896 పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీల పనులు చేసే వృత్తి పన్ను ఆదాయం తర్వాత కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులే కీలకం. వాటితోనే పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీరు తదితర పనులు చేపట్టేందుకు ఆస్కారం ఉంటుంది. అవి సకాలంలో రాకపోయినా, పూర్తిస్థాయిలో విడుదల కాకపోయినా పంచాయతీలకు ఆర్థిక ఇబ్బందులు తప్పవు. 15వ ఆర్థిక సంఘం నిధులు వాస్తవానికి ఆగస్టులోనే విడుదల కావాల్సి ఉంది. నెల రోజులకు పైగా ఆలస్యం కావడంతో, పంచాయతీలకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. కనీసం ఒక్క వీధి లైటును మార్చుకోలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల కాలంలో వర్షాలు విపరీతంగా కురవడంతో పల్లెల్లో ఎక్కడ చూసినా కాలువల నుంచి మురుగు ప్రవహిస్తోంది. నివాస పరిసర ప్రాంతాల్లోనే చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. బావులు, బోర్ల వద్ద దుర్గంధం, మురుగునీరు నిల్వ ఉంటోంది. పంచాయతీ ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో పారిశుధ్య పనులపై పెద్దగా దృష్టిసారించలేకపోయారు. పరిస్థితి మరీ తీవ్రంగా ఉన్న చోట పంచాయతీ కార్యదర్శులే తమ సొంత డబ్బులతో పనులు చేయించారు.

ఆర్థిక సంఘం నిధులు రూ.32.51 కోట్లు విడుదల

పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు వారం రోజుల కిందట పంచాయతీ ఖాతాల్లో జమ అయ్యాయి. జిల్లాలోని 896 పంచాయతీలకు మొత్తం రూ.32.51 కోట్లు వచ్చాయి. అందులో 2024-25 టైడ్ నిధుల కింద రూ.19.51 కోట్లు జమ అయ్యాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో విడత కింద రూ.13 కోట్లు వచ్చాయి. మొత్తం కలిపి రూ.32.51 కోట్లు జమ అయ్యాయి. పంచాయతీలకు వచ్చిన నిధులు ఏ మాత్రం సరిపోవని సర్పంచ్‌లు, కార్యదర్శులు చెప్తున్నారు. పంచాయతీల్లో పారిశుధ్య పనుల కోసం నియమించిన క్లాప్ మిత్రల జీతాలకే సగం సొమ్ము ఖర్చు అవుతోందని, ఉన్న వాటితో ఇంకా ఏం పనులు చేస్తామని వారు పెదవి విరుస్తున్నారు. ఉన్న నిధులతో పంచాయతీల్లో తీవ్రంగా అపారిశుధ్యం నెలకొన్న ప్రాంతాలకు ప్రాధాన్యం ఇచ్చి పనులు చేపడుతున్నారు.

అపారిశుధ్య పరిస్థితులతో పెరుగుతున్న జ్వర పీడితులు

వర్షాలు, వాతావరణ మార్పుల ప్రభావంతో జనం రోగాల బారిన పడుతున్నారు. జిల్లాలో డెంగీ, టైఫాయిడ్, ఇతర విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వరం, ఒళ్లు నొప్పులు, దగ్గు, జలుబు తలనొప్పితో బాధపడుతూ వందలాది మంది నిత్యం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్)తో పాటు ప్రైవేట్ ఆస్పత్రులకు వస్తున్నారు. పారిశుధ్య లోపంతో దోమలు విపరీతంగా పెరగడం, తాగునీరు కలుషితం కావడంతో జ్వరాలు వ్యాపిస్తున్నాయి. ఇంట్లో ఒకరికి జలుబు, దగ్గు, జ్వరం వచ్చిందంటే వారంలోపు మిగతా వారు బాధితులవుతున్నారు. జ్వరాలతో శ్రీకాకుళం జిజిహెచ్‌కు ఓపికి రోజూ వంద నుంచి 120 మంది వరకు రోగులు వస్తున్నట్లు తెలుస్తోంది. జ్వరాల తీవ్రతతో ఆస్పత్రిలో అడ్మిట్ అవుతున్న వారి సంఖ్య కూడా పెరిగినట్లు అధికారులు చెప్తున్నారు. వీరంతా పల్లెల నుంచి వస్తున్న వారే కావడం గమనార్హం. పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర గ్రాంట్ కింద సాయం చేయాలని సర్పంచ్‌లు కోరుతున్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

మున్సిపల్ కార్మికులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలకు సిద్ధం
- మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తోందని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి ఎన్.వై నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.నూకరాజు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పి.తేజేశ్వరరావు విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్ పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా 7వ మహాసభలు నగరంలోని బాపూజీ కళామందిర్‌లో శుక్రవారం నిర్వహించారు. తొలుత శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి బాపూజీ కళామందిర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా సేవలందించి మృతి చెందిన జి.సుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, 12వ పిఆర్‌సి అమలు చేయాలని జూలైలో రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్ కార్మికులు పది రోజులు, పారిశుధ్య కార్మికులు ఏడు రోజులు సమ్మె చేశారని తెలిపారు. సమ్మెకాలపు ఒప్పందాలకు, సమ్మెకాలపు జీతం చెల్లించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని, ఇందుకు సంబంధించి జిఒలు జారీ చేయాలని కోరారు. ఎన్ఎంఆర్‌లకు 7 ఏళ్లుగా జీతాలు పెంచలేదని, 20 నుంచి 25 ఏళ్ల సర్వీసు ఉన్న వారికి రూ.13 వేలు ఇస్తున్నారని తెలిపారు. వీరికి రూ.21 వేల జీతం, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని కోరారు. బదిలీ, కోవిడ్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. నెలంతా పని కల్పించాలని, ఖాళీల భర్తీలో వీరికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి రూ.21 వేల జీతం చెల్లించాని కోరారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన జీతం చెల్లించాలని, లేకుంటే జిఒ నంబరు 1615 ప్రకారం పిఆర్‌సి జీతాలు, డిఎ, మధ్యంతర భృతి, ఇంజినీరింగ్ కార్మికులకు టెక్నికల్ జీతాలు చెల్లించాలని కోరారు. గ్రాట్యుటీ చెల్లింపు, వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలన్నారు. సిక్, డెత్, రిటైర్మెంట్ అయిన వారి స్థానాల్లో పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. పట్టణ విస్తరణ మేరకు కార్మికుల సంఖ్యను పెంచి, పనిచేస్తున్న వారిపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధమైన సెలవులు, రక్షణ పరికరాలు భద్రతా సౌకర్యాలు సకాలంలో అందించాలన్నారు. అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించాలని కోరారు.

ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక



యుగంధర్

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులుగా పి.తేజేశ్వరరావు, అధ్యక్షులుగా డి.యుగంధర్, ప్రధాన కార్యదర్శిగా ఎన్.బలరాం ఉపాధ్యక్షులుగా ఎం.వి.ఎస్ పట్నాయక్, ఎ.గణేష్, సహాయ కార్యదర్శులుగా మురుగన్, పి.ఢిల్లీ, కోశాధికారిగా టి.సంతోష్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎ.శంకర్ గణేష్, ఎ.మోహన్, సభ్యులుగా 14 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



బలరాం



విద్యుత్ ఉద్యోగుల నిరసన దీక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఎపి పవర్ ఎంప్లాయిస్ జెఎసి ఆధ్వర్యాన ఆ విద్యుత్ శాఖ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయ ప్రాంగణంలో నిరసన దీక్షలు చేపట్టారు. రెండు రోజుల పాటు చేపట్టే ఈ దీక్షలను జెఎసి చైర్మన్ గోపాలరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలం విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు నేటికీ చాలీచాలని వేతనాలతో కనీస భద్రత కరువై జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని ఒత్తిడిని తగ్గించాలని, కొత్త ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. ఇంతవరకూ ఒక్కో ఉద్యోగికి రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకూ ఎరియర్స్ రావాల్సి ఉందని, ఇంతవరకూ చెల్లించలేదని విమర్శించారు. ప్రతి పిఆర్‌సిలోనూ తమకు అన్యాయం జరుగుతూనే ఉందని వాపోయారు. జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2ను విద్యుత్ సంస్థలో పూర్తిగా విలీనం చేయాలని కోరారు.

విద్యుత్ సంస్థలో పెన్షన్ ట్రస్టును బలోపేతం చేయాలని, రిటైర్మెంట్ తర్వాత కనీసం రూ.ఐదు లక్షలు పెన్షన్ బెనిఫిట్స్ వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. 1999 అక్టోబరు నుంచి 2004 ఆగస్టు వరకూ ఇపిఎఫ్, జిపిఎఫ్ వెంటనే అమలు చేయాలన్నారు. విద్యుత్ ఉద్యోగులకూ, పెన్షనర్లకూ వారి వైద్య ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెఎసి కన్వీనర్ జి.ఆర్ కుమార్, కో చైర్మన్లు పి.వి అప్పలనాయుడు, టి.వి గురునాథరావు, ఎం.శ్రీను, పి.ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.



పకడ్బందీగా పెట్రోలింగ్ గస్తీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జాతీయ రహదారి మార్గంలో 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ, పకడ్బందీగా హైవే పెట్రోలింగ్ గస్తీ విధులు నిర్వర్తించాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పెట్రోలింగ్ సిబ్బందికి సూచించారు. శ్రీకాకుళం నుంచి కాశీబుగ్గ వరకు 16వ నంబరు జాతీయ రహదారిలో ఉన్న హైవే పెట్రోలింగ్ వాహనాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ క్రమంలో సిబ్బందితో మాట్లాడుతూ నిరంతరం వాహన తనిఖీలు చేస్తూ, అనుమానిత వ్యక్తులను ప్రశ్నిస్తూ ఉండాలన్నారు. హైవేలపై వేగంగా నడిపే వాహనాలు, అనుమానాస్పద వాహనాలు, మద్యం సేవించి డ్రైవింగ్ చేసే వారు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. గంజాయి, పశువుల అక్రమ రవాణా చేసే వాహనాలు గుర్తించి సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రమాదాలు సంభవించేందుకు అవకాశం ఉన్న బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో పగటి, రాత్రిపూట విజిబుల్‌గా వేగ, ప్రమాద నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. సర్వీస్ రోడ్డు మార్గంలో రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాలు నియంత్రించాలని సూచించారు. వేకువజామున సమయంలో టోల్‌ప్లాజా, చెక్‌పోస్టుల వద్ద వాహన చోదకులకు నిరంతరం ఫేస్ వాష్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రమాద నివారణ, సహాయక చర్యల్లో భాగంగా ప్రమాద హెచ్చరిక, మలుపు, అతి వేగ నియంత్రణ సూచిక బోర్డులు, స్టాపర్స్ సోలార్ బ్లింకర్స్ నిర్వహణ సక్రమంగా ఉండేలా హైవే అథారిటీ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.

బిఆర్‌ఎయుకు గ్రీన్ అడిట్ గుర్తింపు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయానికి గ్రీన్ అడిట్ గుర్తింపు లభించింది. జిసి కన్సల్టెన్సీ సర్వీసెస్ (గోరఖ్‌పూర్-ఉత్తరప్రదేశ్) ఈ గుర్తింపును ఇస్తూ వర్సిటీకి సమాచారం అందించింది. జిసి కన్సల్టెన్సీ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ విశాశ్ శ్రీవాత్సవ్ నేతృత్వంలోని బృందం ఈ ఏడాది జులై 22, 23 తేదీల్లో కేంపస్‌లో పర్యటించి వర్సిటీలోని బోధన, పరిపాలన, పరిశోధన, సేవలు, సౌకర్యాలు, పర్యావరణ సంబంధిత అంశాలను పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణకు వర్సిటీ తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను ప్రశంసిస్తూ గ్రీన్ అడిట్ యూనివర్సిటీగా గుర్తింపునిచ్చారు. క్వాలిటీ, ఎన్విరాన్‌మెంట్, ఎనర్జీ, ఎడ్యుకేషన్ ఆర్గనైజేషన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ కేటగిరీల్లో 2025 విద్యా సంవత్సరానికి గానూ ఐఎస్‌ఒ గుర్తింపును ఇస్తూ సర్టిఫికెట్లను జారీ చేశారు. వర్సిటీ ఐక్యుఎసి కోఆర్డినేటర్ రెడ్డి తిరుపతిరావు, సభ్యులు ఎన్.శ్రీనివాస్, జి.కిరణ్ కుమార్, పి.మాధవరావును వర్సిటీ వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజని శుక్రవారం అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
- ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ దత్తత

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా ప్రమాణాలు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్‌ను శుక్రవారం సందర్శించారు. పాఠశాల పరిధిలో ఎంపీ లాడ్స్ నిధులతో నిర్మాణ దశలో ఉన్న తిలక్ హాల్ పనులను పరిశీలించి పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఎంపీ లాడ్స్ నుంచి రూ.50 లక్షల నిధులతో ఆడిటోరియం నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం క్లాసులకు వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులతో కలిసి కూర్చుని వారి నోటు పుస్తకాలను పరిశీలించారు. ఇక్కడి విద్యార్థులు పాఠశాల చరిత్రను తిరగరాసే రీతిలో ఉత్తమ ఫలితాలు కనబరచాలని పిలుపునిచ్చారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య బట్టి మౌలిక వసతులు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సమస్యలపై దృష్టిసారించాలని అధికారులకు సూచించారు. ఈ పాఠశాలను దత్తత తీసుకొని ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తానన్నారు. రాష్ట్రంలో మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. సుదీర్ఘ చరిత్ర గల ఈ పాఠశాలలో మరుగుదొడ్లు, సైన్స్ ల్యాబ్, గ్రౌండ్ తదితర సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఈ పాఠశాలలో చదివిన వారు దేశ, విదేశాల్లో ప్రస్తుతం ఉన్నారని, అంతటి ఘన చరిత్ర ఉన్న పాఠశాల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. స్వచ్ఛాంధ్ర ఉద్యమ స్ఫూర్తితో ప్లాస్టిక్ ఫ్రీ స్కూల్స్ కోసం అందరూ సహకరించాలని కోరారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

2.0 వ్యవస్థను రద్దు చేయాలి

దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం తీసుకొచ్చిన 2.0 వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా దస్తావేజు లేఖరులు శుక్రవారం పెన్‌డౌన్ నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన కొనసాగించి సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. శనివారం కూడా ఈ నిరసన కొనసాగించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ పాత రిజిస్ట్రేషన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. 2.0 విధానం వల్ల ఒక రిజిస్ట్రేషన్ చేయాలంటే ఎంతో సమయం పడుతోందన్నారు. ఈ విధానంతో అధికారులకు పనిభారం తక్కువగా ఉంటుందని, దస్తావేజు లేఖరులే రిజిస్ట్రేషన్ ప్రక్రియ అంతా చేయాల్సి వస్తోందన్నారు. ఆధార్‌కు ఫోన్ నంబర్ లింకు కాకుంటే సాధ్యపడడం లేదన్నారు. ఈ విధానం వల్ల ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న దస్తావేజు లేఖరులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దస్తావేజు లేఖరుల సంఘం నాయకులు ఎ.రాజారావు, బి.రామకృష్ణ, టి.భువన్, సిహెచ్.మహేష్, కె.రమణారావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖరులు

వికలాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

వికలాంగుల సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ప్రతి నెలా మూడో శుక్రవారం నిర్వహించే వికలాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ (స్వాభిమాన్) కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వినతులు స్వీకరించారు. వికలాంగుల సమస్యలు విని, వారి నుంచి వినతిపత్రాలు స్వీరించారు. జిల్లావ్యాప్తంగా 40 వినతులు వచ్చాయి. వికలాంగులు ప్రస్తావించిన సమస్యలకు సంబంధిత అధికారులకు పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఇద్దరు వికలాంగులకు ట్రైసైకిళ్లు, అవసరమైన వారికి హ్యాండ్ స్టిక్కులు, వినికిడి యంత్రాలను అందజేశారు. ఎక్కువ మంది వికలాంగులు బెడ్ రెస్టు పింఛను రూ.15 వేలు అందజేయాలని కోరారు.

ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరణ

స్వాభిమాన్ ముగిసిన తర్వాత ఉద్యోగుల నుంచి ప్రత్యేకంగా వినతులు స్వీకరించారు. బదిలీ అయిన స్టాఫ్ నర్సులను డిఎంహెచ్‌ఒ రిలీవ్ చేయడం లేదని ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఇన్‌ఛార్జి వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి శ్రీధర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

పరిశరాలు పరిశభ్రంగా ఉండాలి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సూచించారు. కాకివీధి, మోనంగివారితోట సచివాలయం, కామాక్షి కాలనీలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు మన ఆరోగ్యానికి ప్రధాన శత్రువులని చెప్పారు. దోమల ద్వారా మలేరియా, బోధవ్యాధి, డెంగ్యూ, మెదడు వాపు, చికెన్ గున్యా వంటి వ్యాధులు వ్యాపిస్తున్నట్లు వివరించారు.

కార్గిల్ పార్కును సుందరీకరిస్తాం

కార్గిల్ పార్క్‌ను సుందరీకరించనున్నట్లు రామ్మోహన్ నాయుడు తెలిపారు. నగరంలోని ఎపిహెచ్‌బి కాలనీలోని కార్గిల్ పార్క్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. పార్కు నిర్వహణ సక్రమంగా లేదని, పార్కులో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్క్ రీడింగ్ రూమ్, వాకింగ్ ట్రాక్ పూర్తిగా నిరుపయోగంగా మారాయని, డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో పార్కులో నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. కనీసం చిన్నారులు ఆడుకోవడానికి కూడా అనువుగా లేదన్నారు. సమస్యలు విన్న మంత్రి.. సుడా నిధులతో బ్యూటిఫికేషన్, చిల్డ్రన్ పార్క్, రీడింగ్ రూమ్, కార్గిల్ థీమ్‌తో, జవాన్ల బొమ్మలతో కూడిన విగ్రహాలను నెలకొల్పాలని కలెక్టర్‌ను ఆదేశించారు. 15 రోజుల్లోగా సుందరీకరణకు సంబంధించి డిజైన్లు పూర్తి చేయాలన్నారు.



వికలాంగుల సమస్యలు వింటున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

పారిశుధ్య నిర్వహణ ఇలాగేనా..?

- తాండవిస్తున్న అపారిశుధ్యం
- వ్యాధులు ప్రబలుతాయని గ్రామస్తుల భయాందోళన
- పంచాయతీ అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం

గ్రామాల్లో పారిశుధ్య నిర్వాహణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. పారిశుధ్య నిర్వాహణకు ప్రభుత్వాలు స్వచ్ఛత హీ సేవ, డ్రై డే, ఫ్రైడే వంటి ఎన్నో కార్యక్రమాలను చేపడుతున్నా, కొంతమంది పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో వాటికి తూట్లు పొడుస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో గ్రామాల్లో నెలకొన్న అపారిశుధ్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


పాఠశాల ప్రహరీ పక్కన పిచ్చిమొక్కలతో అధ్వానంగా కాలువ


ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని లయిదాం గ్రామంలో కొంతకాలంగా పారిశుధ్య పనులను చేపట్టక పోవడంతో కాలువలు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాలతో నిండుకుని అధ్వాన్నంగా మారాయి. గ్రామంలోని ఏ వీధిలో కాలువలను చూసినా పిచ్చిమొక్కలు నిండుగా పెరిగి అధ్వాన్నంగా కనిపిస్తున్నాయి. దీంతో దుర్వాసనతో పాటు దోమలు పెరిగిపోయి వ్యాధుల బారిన పడుతున్నామంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు అపరిశుభ్రత వలన దోమలు పెరిగి మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందంటూ వాపోతున్నారు. వర్షా కాలం కావడంతో అపారిశుధ్యం కార ణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవ కాశం ఉందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

గ్రామంలో పంచాయతీ ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అపారిశుధ్యం నెలకొందంటూ పలువురు పేర్కొంటున్నారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలపై అధికారులు కనీసం అవగాహన కార్యక్రమాలను చేపట్టక పోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. కొన్ని నెలలుగా కాలువలను శుభ్రం చేయక పోవడంతో మురుగు పేరుకుపోవడంతో పాటు చెత్తా, చెదారాలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి అధ్వాన్నంగా దర్శినమిస్తున్నాయి. గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన కాలువలు, సచివాలయం సమీపంలోని పాఠశాలను ఆనుకుని ఉన్న కాలువల పరిస్థితి మరీ దారుణంగా ఉన్నాయంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధి కారులు తక్షణమే స్పం దించి గ్రామ ంలో పారిశు ధ్య కార్య క్రమాలు చేపట్టి కాలువ లను శుభ్రం చేయా లని ప్రజలు కోరు తున్నారు.


మురుగుకాలువలో ఉన్న పైపులు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ఫిర్యాదులను పరిష్కరించాలి

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- పలాస

ప్రజలు తమ సమస్యలను ప్రజా గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీస్ అధికారులకు ఆదేశించారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ప్రజాగ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు చేపట్టి న్యాయం చేయాలని ఆదేశించారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అధికారులకు హెచ్చరించారు.


నినదిస్తున్న కార్మికులు

సిఐటియులో చేరిక

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న థర్డ్‌పార్టీ కాంట్రాక్ట్ ఉద్యోగులు సిఐటియు నాయకత్వంలో ఎ.పి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌లో శుక్రవారం చేరారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఆర్.సురేష్ బాబు, శ్రీకాకుళం జిజిహెచ్ కాంట్రాక్టు, ఔట్‌సోర్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మామిడి సూర్యనారాయణ, కార్యదర్శి జె.వి రమణ ఆధ్వర్యంలో నరసన్నపేట ఆస్పత్రిలో పనిచేస్తున్న 30 మంది సెక్యూరిటీ, శానిటేషన్ వర్కర్లు సిఐటియు సంఘంలో చేరారు. తమకు ప్రభుత్వ జిఒలు అమలు కావటం లేదని వర్కర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నా కాంట్రాక్టర్లు చేస్తున్న దోపిడీని అధికారులు అడ్డుకోలేక పోతున్నారని తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు ఆర్.సురేష్ బాబు మాట్లాడుతూ వర్కర్ల సమస్యలు పరిష్కారం కావాలంటే ఐక్యతతో ఉద్యమించటం మినహా మరో మార్గం లేదని తెలిపారు. సిఐటియు, కాంట్రాక్టు ఎంప్లాయీస్ ఫెడరేషన్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ వారి పోరాటానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.


విచారణ చేస్తున్న ఎపిడి రాధ

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని ఎపిపేట ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గుమన గుణ సింహాచలం పనితీరుపై శుక్రవారం డుమా ఎపిడి పి.రాధ ఎపిపేట సచివాలయంలో కూలీల సమక్షంలో విచారణ చేశారు. ఉపాధిహామీ పథకానికి సంబంధించి ఇటీవల నిర్వహించిన ఆడిట్‌లో ఎపిపేట ఫీల్డ్ అసిస్టెంట్‌పై కూలీలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ ఫిర్యాదులో ఫీల్డ్ అసిస్టెంట్ మద్యం సేవించి విధులకు హాజరవుతున్నారని, జాబ్‌కార్డు సక్రమంగా అందించడం లేదని, 100 రోజులు పని కల్పించడం లేదని, కూలీల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారని, వలస వెళ్లిన వారికి మస్టర్లు వేసి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కూలీలకు అన్యాయం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక సర్పంచ్ కొరికాన వెంకట శివ సాయి సీతారామరాజు, కోపరేటివ్ సొసైటీ డైరెక్టర్ దేవాడ శ్రీనివాసరావు, గ్రామపెద్దలు సమక్షంలో క్షుణ్ణంగా విచారణ చేశారు. ఈ విచారణలో కూలీలు, పెద్దలు ఇచ్చిన ఫిర్యాదులను స్వీకరించి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లటం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈ విచారణలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఇసి నారాయణ మూర్తి, కార్యదర్శి విక్రం, టెక్నికల్ అసిస్టెంట్లు సత్యనారాయణ, సునీత తదితరులున్నారు.

అసంఘటితరంగ కార్మికులకు చట్టపరమైన సేవలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

అసంఘటితరంగ కార్మికులకు అందుబాటులో ఉన్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు పేర్కొన్నారు. స్థానిక న్యాయ సేవా సదన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్ చట్టం 1996 కింద అనేక రాష్ట్రాలు సెస్ వసూలు చేస్తున్నప్పటికీ, కార్మికుల ప్రయోజనం కోసం వినియోగం చాలా తక్కువగా జరుగుతోందని తెలిపారు. కార్మికుల నమోదు తక్కువగా ఉండడం, ఇప్పటికే నమోదైన వారికి కూడా ప్రయోజనాలు అందకపోవడం దీనికి ప్రధాన కారణమని వివరించారు. అధికారులు, లబ్ధిదారుల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడంలో న్యాయ సేవా సంస్థలు కీలక పాత్ర పోషించగలవని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో న్యాయవాది ఇందిరా ప్రసాద్, అసంఘటితరంగ కార్మికుల యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

టెక్కలి: రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో నెలకొంటున్న యూరియా కొరతపై ప్రభుత్వమే స్పందించి బాధ్యత వహించాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి పేడాడ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. హరిత విప్లవం కొనసాగుతున్న సమయంలో రైతులకు సేంద్రియ ఎరువుల ద్వారా వ్యవసాయం చేసుకుంటున్న క్రమంలో నాటి ప్రభుత్వాలు బహుళ జాతి కంపెనీలకు తలొగ్గి యూరియాను రైతులకు అలవాటు చేశారని, అప్పటి నుంచి వివిధ రకాల తెగుళ్లు, వ్యాధులకు పురుగు మందులను వ్యవసాయంపై చల్లించి రైతులకు సేంద్రియ వ్యవసాయం నుంచి దూరం చేసింది ప్రభుత్వ విధానాలే అన్నారు. రష్యా యుద్ధం నేపథ్యంలో యూరియా సరఫరా తగ్గడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడు యూరియా సరఫరా చేయలేక చేతులెత్తేస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో ఒకప్పుడు యూరియా ఉత్పత్తి చేసే మార్కోఫెడ్ పరిశ్రమ మూతబడడానికి ప్రభుత్వ పాలకులు కాదా అని ఆయన ప్రశ్నించారు. యూరియా కొరతకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

నేడు క్లస్టర్ సముదాయాలు

ప్రజాశక్తి- టెక్కలి

సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ప్రతినెల చేపడుతున్న క్లస్టర్ సముదాయాలు శనివారం జరగనున్నాయి. విద్యాశాఖ దసరా సెలవులు ప్రకటించిన నేపథ్యంలో శనివారం క్లస్టర్ సముదాయాలు నిర్వహించనున్నారు. ఎప్పటి మాదిరిగానే ఉదయం పాఠశాలలో విధులు నిర్వర్తించిన అనంతరం రెండవ పూట క్లస్టర్ సముదాయాలకు ఉపాధ్యాయులు హాజరు కావాల్సి ఉంది. ఈ విధానం వల్ల ఉపాధ్యాయులకు ఉపయోగం లేదని, పాత విధానాన్నే కొనసాగించాలని గతేడాది నుంచి విద్యాశాఖ అధికారులకు ఉపాధ్యాయులు, సంఘాలు విన్నవించినప్పటికీ ఫలితం లేదు. ప్రభుత్వంలో క్లస్టర్ సముదాయాలపై మార్పులు చోటు చేసుకుంటాయని భావించినప్పటికీ గత ప్రభుత్వ విధానం మేరకే క్లస్టర్ సముదాయాలు నిర్వహిస్తున్నారు.

బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి- పలాస

విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్లు ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కె.సాయికుమార్ డిమాండ్ చేశారు. కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జిఒ నెంబర్ 77ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పిపి విధానంలో 10 మెడికల్ కాలేజీలు కార్పొరేట్ వ్యక్తులకు లీజుకి ఇవ్వడాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. 2020, 21, 22, 23లో పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు కళాశాల యాజమాన్యం ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు సోమేష్, రవికుమార్, కిరణ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

చిగురుకొత్తపల్లిలో పారిశుధ్య పనులు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన


పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ ఎంపిడిఒ పద్మజ, కార్యదర్శి తదితరులు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని చిగురుకొత్తపల్లి పంచాయతీలో ఎట్టకేలకు పారిశుధ్య పనులు ప్రారంభించారు. సెప్టెంబర్ 18న చిగురు కొత్తపల్లిలో అపారిశుధ్యం అనే శీర్షికతో ప్రజాశక్తిలో కథనం వెలువడింది. దీంతో అధికారులు స్పందించారు. శుక్రవారం కార్యదర్శి ఎ. శివకృష్ణ నాయుడు ఆధ్వర్యంలో గ్రామంలోని వీధి కాలువల్లో కూలీలతో పూడికతీతలు నిర్వహించారు. గ్రామంలో ప్రతీ వీధిలోను, కాలువల్లోని పూడికలు, చెత్త, పిచ్చిమొక్కలు తీయడం ప్రారంభించారు. మొత్తం శుభ్రం చేసి బ్లీచింగ్ జల్లి, చేతిపంపులు, తాగునీటి కుళాయిల వద్ద శుభ్రం చేశారు. ఈ పనులను డిప్యూటీ ఎంపిడిఒ డి.పద్మజ దగ్గరుండి పర్యవేక్షించారు. శనివారం కూడా జెసిబితో మొత్తం గ్రామంలోని వీధి కాలువల్లోని పూడికలు, రోడ్లను శుభ్రం చేయడం జరుగుతుందని డిప్యూటీ ఎంపిడిఒ పద్మజ తెలిపారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంతవరకు మురుగు, పూడికలతో దుర్గదపు వాసనతో, దోమలు, ఈగలతో బాధలు పడ్డామని, ఇప్పుడు పనులు చేపట్టడం సంతోషంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. ఇఒపిఆర్‌డితో పాటు మాజీ సర్పంచ్ కోనేటి శ్రీనువాసరావు, కార్యదర్శి నాయుడు తదితరులున్నారు.

కెజిబివిలో భవన నిర్మాణ సామగ్రి

- ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- చోద్యంచూస్తున్న అధికారులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని తాళ్లవలస వద్ద నున్న కెజిబివి పాఠశాలలో అదనపు గదుల నిర్మాణ పనుల్లో భాగంగా గుత్తేదారు పాఠశాల ప్రధాన ద్వారం వద్ద సిమెంట్ బస్తాలను నిల్వ చేయడం వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిమెంట్ దూళి కారణంగా విద్యార్థులకు డస్ట్ ఎలర్జీ, పలు రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కెజిబివి అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తూ చోద్యం చూస్తుండడం తగదని పలువురు వాపోతున్నారు. విద్యార్థుల చదువుకు అంతరాయం కలిగిస్తూ వారి ఆరోగ్యంతో ఆటలాడడం తగదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాల ముఖ ద్వారం వద్ద భవన నిర్మాణ సామగ్రిని నిల్వ చేయడం తగదని వెంటనే ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సిమెంట్ బస్తాలను అక్కడి నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఇదే విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ శిరీషను వివరణ కోరగా సమగ్ర శిక్ష అభియాన్ ఎసిపి శశిభూషణ్ ఆదేశాల మేరకే నిల్వలకు అనుమతి ఇచ్చామని, తల్లిదండ్రులకు అభ్యంతరం ఉంటే వారు ఫిర్యాదు రాసి ఇస్తే ఎసిపి దృష్టికి తీసుకు వెళ్లి సిమెంట్ బస్తాలను తొలగించే చర్యలు తీసుకుంటామని తెలిపారు.


పాఠశాల ముఖద్వారం వద్ద నిల్వ చేసిన సిమెంట్ బస్తాలు, ఇతర సామగ్రి

విశాఖ ఎడిఆర్‌ఎంకు స్వాగతం


స్వాగతం పలుకుతున్న కాలనీవాసులు

ప్రజాశక్తి- పలాస

విశాఖపట్నం అడిషనల్ డివిజన్ రైల్వే మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించడానికి వచ్చిన కుందు రామారావుకు పలాస రైల్వేస్టేషన్లో ఆయన నివాసం ఉంటున్న జిఎంఇ కాలనీవాసులు శుక్రవారం ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక జిఎంఇ కాలనీలో రామారావు కుటుంబం 10ఏళ్లుగా నివాసం ఉంటోంది. ఈ క్రమంలో ఆయన విశాఖ జోన్‌కు 2 ఎడిఆర్‌ఎంగా పదోన్నతి లభించింది. రామారావు స్వగ్రామం గడ్డూరు. ఎర్రముక్కాం గ్రామంలో విద్యాభ్యాసం చేశారు. 2006లో ఇంజనీరింగ్ సర్వీస్ పరీక్షలు రాసి ఆలిండియా 44వ ర్యాంకు సాధించారు. నాగపూర్, రాయపూర్, బిలాస్పూర్, గుంటూరు, విజయవాడ జోన్లలో ఇంజనీరింగ్ అధికారిగా పనిచేశారు. పదోన్నతి లభించడంతో విశాఖపట్నం ఎడిఆర్‌ఎంగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టించి చదువుకోవాలని కోరారు. ఉత్తరాంధ్ర జిల్లాలో కొత్తగా వచ్చిన రైల్వేజోన్‌లో మొదటిసారిగా ఎడిఆర్‌ఎంగా పనిచేసే అవకాశం లభించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిఎంఇ కాలనీవాసులు స్వాగతం పలుకుతూ కాలనీ వరకూ రెండు కిలోమీటర్ల మేర ర్యాలీ నిర్వహించారు.

ఐతమ్‌లో పిసిబి డిజైన్ వర్క్‌షాప్

టెక్కలి రూరల్: టెక్కలి ఐతమ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో "సిఎమ్ ఎక్సలెన్స్ ల్యాబ్' నిర్వహిస్తున్న పిసిబి డిజైన్‌పై ఐదు వారాల వర్క్‌షాప్ ప్రారంభమైనట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ వర్క్‌షాప్ సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ నెల చివరి వారం వరకు జరగనుంది. ఇసిఇ విభాగం ద్వితీయ సంవత్సరానికి చెందిన విద్యార్థులు ఇందులో పాల్గొంటున్నారు. ఈ విద్యార్థులు లైవ్‌వైర్, పిసిబి విజార్డ్, ఇడిఎ సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించి సర్క్యూట్ రూపకల్పన, లేఅవుట్ డిజైన్, డబుల్ లేయర్ పిసిబి డిజైన్ వంటి ప్రాక్టికల్ నైపుణ్యాలను అభ్యసించనున్నారు. ఈ శిక్షణను ఎపి ఎస్ఎస్‌డిసి తరపున మహీధర్, ఎస్.కె. రుబీనాలు శిక్షణను అందిస్తున్నారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఇసిఇ విభాగాధిపతి డా. వి.అశోక్ కుమార్, ఎపి ఎస్ఎస్‌డిసి స్పాక్ డా. బి.రామారావు, విభాగ కోఆర్డినేటర్ డా.ఇ.జయ పర్యవేక్షిస్తున్నారు.

ఇథనాల్ ఉత్పత్తితో పర్యావరణానికి మేలు


మాట్లాడుతున్న శాస్త్రవేత్త సుధీర్

ప్రజాశక్తి- రణస్థలం

వ్యవసాయ పరిశోధనా స్థానం పెద్దాపురం, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కజొన్న రైతుల అవగాహన కార్యక్రమం శుక్రవారం లావేరులో నిర్వహించారు. మొక్కజొన్న నుంచి ఇథనాల్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా మొక్కజొన్న సాగు చేసే రైతుల ఆదాయం మెరుగుపడుతుందని పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఐ.సుధీర్ అన్నారు. మొక్కజొన్న సాగుచేస్తున్న రైతుల క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ ఇంధన అవసరాల దృష్ట్యా మొక్కజొన్న వంటి పునరుత్పాదక వనరులతో ఇంధనం ఉత్పత్తి చేస్తే పర్యావరణానికి మేలు కలగడమే కాక, మొక్కజొన్న ఇథనాల్ ఉత్పత్తికి డిమాండ్ పెరిగి, మొక్కజొన్న ధరలు పెరగవచ్చని సూచించారు. మొక్కజొన్న సాగుకు రైతులు మోతాదుకు మించి నత్రజని ఎరువులు వినియోగిస్తున్నారని, దీనివలన సాగు ఖర్చులు పెరగడంతో పాటు పర్యావరణానికి హాని కలుగుతుందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. కార్యక్రమంలో వై.పి.హాఫీజా, డాక్టర్ రెడ్డీస్ సమన్వయకర్తలు ఎస్.సాయిదుర్గ, ఐ.అనిల్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'ఉల్లాసం'గా అక్షరాంధ్ర


కవిటి : ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- కవిటి

మండల పరిషత్ కార్యాలయం, మండల వెలుగు కార్యాలయంలో రెండో విడత అక్షరాంధ్ర ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 400 మంది వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు ఎపిఎం గోవిందరావు తెలిపారు. వీరందరూ ఎన్‌ఆర్‌ఇజిఎస్, ఎస్‌హెచ్‌జిలలో ఉన్న 4 వేల మంది నిరక్షరాస్యులకు చదవడం, రాయడంతో పాటు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, లీగల్ అక్షరాస్యత, చైల్డ్‌కేర్ ఎడ్యుకేషన్ అంశాలపై బోధిస్తారని ఆయన తెలిపారు. అనంతరం సభ్యులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, ఎఎంసి చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, మాజీ జెడ్‌పిటిసి బెందాళం రమేష్, ఎంపిడిఒ త్రినాథ్, ఎఒ శ్రీనివాస రెడ్డి, ఇన్‌ఛార్జి ఎపిఒ మోహనరావు, ట్రైనింగ్ రిసోర్స్ పర్సన్ పి.హిమగిరి, త్రిలోచన బిసాయి తదితరులు పాల్గొన్నారు.


లావేరు: స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరం, వెలుగు కార్యాలయాల్లో నిర్వహించిన అక్షర ఆంధ్రా ఉల్లాస్ శిక్షణ కార్యక్రమంలో ఎంపిడిఒ పి.వెంకటరాజు పాల్గొన్నారు. మార్చిలో జరిగే పరీక్షల్లో అందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం కావాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎం బి.వి.సుబ్బయ్యనాయుడు, ఎపిఒ రెడ్డి సత్యవతి, వయోజన విద్య సూపర్‌వైజర్ రమణమ్మ, విఒఎలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పలాస: ప్రభుత్వం ప్రతిఒక్కరూ అక్షరాసులుగా ఉండాలని ఉద్దేశంతో ఉల్లాస్ కార్యక్రమాన్ని రూపొందించిందని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలోఉల్లాస్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల్లో ఉన్న మహిళా నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 5 వేల మంది నిరక్షరాస్యులను గుర్తించి ప్రతిరోజు 10 మందితో కలిసి ఒక గ్రూపును ఏర్పాటు చేసి వారితో ప్రతిరోజు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. శిక్షణా కార్యక్రమాన్ని జియో టాగింగ్ చేయవలసి ఉంటుందని తెలిపారు. నిరక్ష రాస్యులను బోధించడానికి అనువుగా 6 రకాల పుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేయడం జరిగిందని చెప్పారు. మెప్మా అధికారి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ నీరజ అధ్యక్షతన ఉల్లాస్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు, ఎంఇఒ-2 ఎన్.శ్రీనివాస్, ఎఒ బసవ రాంబాబు పలువురు పాల్గొన్నారు.

జలుమూరు: మండల పరిషత్ సమావేశం మందిరంలో శుక్రవారం ఎంపిడిఒ బి.చిన్నమ్మడు ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రామారావు, ఎంఇఒలు బమ్మిడి మాధవరావు, ఎం.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక




లావేరు : ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

లావేరు: జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన క్రీడాపోటీల్లో లావేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. కబడ్డీ పోటీల్లో అండర్ 17 విభాగంలో ఎ.జీవిత, అండర్ 14 విభాగంలో కె.శిరీష, ఎం.రోహిత్ ఎంపికకాగా వాలీబాల్ పోటీల్లో అండర్ 17 విభాగంలో వై.మహేష్, అండర్ 14 విభాగంలో బి.హేమంత్ కుమార్, అథ్లెటిక్స్ పోటీల్లో డిస్కస్‌త్రో అండర్ 14 విభాగంలో ఎ.భానుప్రసాద్, హై జంప్‌లో అండర్ 17 విభాగంలో యడ్ల మహేష్, జావలిన్ త్రోలో అండర్ 17 విభాగంలో ఎ.జీవిత, 400 మీటర్ల పరుగు పందెంలో అండర్ 17 విభాగంలో బి.తనూజ, వై. సుస్వంత్, హేమర్‌త్రో అండర్ 17 విభాగంలో డి.హేమంత్ కుమార్, ఎల్.చైతన్య, ఎస్.గోవింద ఎంపికయ్యారు. విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపిక కావడంపై హెచ్‌ఎం పసుపుల జగన్నాథం, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ లంకలపల్లి రాంబాబు, మాజీ అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇనపకుర్తి తోటయ్య దొర, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షులు పిసిని వసంతరావు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు జర్జాన సుదర్శనం, విద్యార్థులను అభినందించారు.

కవిటి: ఇటీవల పలాస మండలంలో మూడు రోజుల పాటు జరిగిన డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలెక్షన్స్‌లో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బ్యాడ్మింటన్‌లో తరుణ్ బెహరా, మండల ప్రణీత్, ఖోఖో, 100 మీటర్ల పరుగు పందెంలో బెహరా కుమారి, లాంగ్ జంప్, 100 మీటర్ల పరుగు పందెంలో పరిమిల్లి ప్రవీణ్, డిస్కస్ త్రోలో కౌశిక్ జిల్లాస్థాయికి అర్హత సాధించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం విశ్వనాథం విద్యార్థులను అభినందిస్తూ, జిల్లా స్థాయిలోనూ రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయులు ప్రకాశ రావు, దీనారావు, జానకిరావు, జగదీశ్వరరావు, కుర్మయ్య, గిరిబాబు, సంయుక్తారాణి, ధనలక్ష్మి, పద్మజ పాల్గొన్నారు.


కవిటి : ఎంపికైన విద్యార్థులు

జనసేన నాయకుడు ఆత్మహత్య


మృతి చెందిన నాగరాజు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధి 17వ వార్డు సంతపేటకు చెందిన జనసేన నాయకుడు ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం చేస్తున్న కర్రి నాగరాజు (46) శుక్రవారం ఇంట్లో మేడపైన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్ఐ ముకుంథరావు వివరాల మేరకు మృతుడు నాగరాజుకు 21ఏళ్ల కిందట బెల్లుపడ గ్రామం కొండివీధికి చెందిన కృష్ణవేణితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. మృతుడు మూడు లారీలతో ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం చేసుకొనేవాడు. నాలుగేళ్ల కిందట రెండు లారీలు ప్రమాదానికి గురై పాడైపోయాయి. ఉన్న ఒక్కలారీని డ్రైవర్‌ను పెట్టుకొని నడుపుకొనేవాడని, జనసేన పార్టీలో కార్యకర్తగా తిరిగేవాడన్నారు. ఉన్న లారీ వ్యాపారం కూడా చక్కగా నడవక పోవటంతో అమ్మేసి ఆర్థికంగా బాగా నష్టపోయి అప్పుల పాలయ్యాడు. తన భర్త ఆర్థిక ఇబ్బందులు చూసిన భార్య కృష్ణవేణి తాను సభ్యురాలుగా ఉన్న డ్వాక్రా గ్రూపులో రూ. 6 లక్షలు రుణం తీసుకొని భర్తకు ఇచ్చింది. తీసుకున్న రుణం కూడా తీర్చలేక మనస్థాపానికి గురై శుక్రవారం ఉదయం తన ఇంటి మేడపైన గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడు భార్య కృష్ణవేణి ఫిర్యాదులో పేర్కొందని తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని తెలిపారు. నాగరాజు మృతితో సంతపేటలో విషాదఛాయలు అలముకున్నాయి.


మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కోటబొమ్మాళి: స్థానిక హరిశ్చంద్రపురం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుని వయసు 50 సంవత్సరాలు ఉంటుందని, ఎడమ కాలు పాదానికి బ్యాండేజ్ కట్టు ఉందని, చేతి కర్ర, మెడలో తాయత్తు ఉన్నాయని, తెలుపు, నీలం రంగు గడులు కలిగిన తువ్వాలు, నలుపు, తెలుపు గీతలు కలిగిన లుంగీ, తెలుపు రంగు బనియన్ ధరించి ఉన్నాడని పలాస జిఆర్‌పి ఎం.సోమేశ్వరరావు తెలిపారు. మృతుని వివరాలు తెలిస్తే 9492250069 నంబర్‌కు సంప్రదించాలని ఆయన సూచించారు.

హడలెత్తించిన నాగుపాము

లావేరు: మండలం తాళ్లవలసలో పైడి గణేష్ ఇంట్లో శుక్రవారం నాగుపాము దూరి కోడిపట్టులో గుడ్లు తింది. కుటుంబసభ్యులు విష సర్పాన్ని చూసి భయంతో బయటకు పరుగులు తీశారు. వెంటనే స్థానికులు స్నేక్ క్యాచర్ భాషాకు సమాచారం అందించారు. భాషా అక్కడకు చేరుకుని చాకచక్యంతో పామును పట్టుకుని సురక్షిత ప్రాంతంలో విడిచి పెట్టారు. దీంతో అక్కడివారందరూ ఊపిరి పీల్చుకున్నారు.


మధ్యాహ్న భోజనం వంటలను పరిశీలిస్తున్న నాయకులు

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

పొందూరు: మండలంలోని రాపాక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజన పథకాన్ని పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ కొంచాడ శేషగిరి ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండుతున్న ఆహార పదార్థాలు, వంటల నాణ్యతను పరిశీలించారు. అనంతరం మెనూ ప్రకారం వండుతున్నది లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు కండాపు శ్రీనివాసరావు, జనసేన జిల్లా సెక్రటరీ కొంచాడ చిన్నం నాయుడు, హెచ్‌ఎం సిహెచ్.శారదాంబ, ఉపాధ్యాయులు ఉన్నారు.

స్పందించిన విద్యుత్ అధికారులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం


మండలం డొంకురులో విద్యుత్ సమస్యలపై ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పర్సనల్ సెక్రటరీ అజయ్ కల్నల్‌కు రెండు నెలల క్రితం ఇచ్చిన వినతిపత్రానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించినట్లు జనసేన మండల నాయకుడు చీకటి కృష్ణయ్య తెలిపారు. గతంలో విద్యుత్ తీగలు తెగిపడుతున్న సందర్భంలో గత ప్రభుత్వం వైసిపి హయాంలో విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు విద్యుత్ సమస్యలు చెప్పినా పట్టించుకోలేదని, రెండు నెలల క్రితం జనసేన మంగళగిరి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే పవన్ కళ్యాణ్ పర్సనల్ సెక్రటరీ అజయ్ కల్నల్‌కు మత్స్యకారుల సమస్యలు వివరించినట్టు తెలిపారు. ఈ ఫిర్యాదు మేరకు గత రెండు రోజులుగా విద్యుత్ శాఖ అధికారి ఎడి రవి డొంకూరులో సందర్శించి విద్యుత్ తీగలను, శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎఇ గోవిందరావు, లైన్‌మేన్‌లు దక్కత జోగారెడ్డి, రామచంద్రను డొంకూరులో పర్యటించారు. త్వరలోనే కొత్త విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంభాలు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు చీకటి కృష్ణయ్య, లోకనాథం, సూర్య నారాయణ, బుడ్డ పాపయ్య, గ్రామ ప్రజలు ఉన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

ఇచ్ఛాపురం: స్థానిక స్వర్ణ భారతి డిగ్రీ కాలేజీలో శుక్రవారం వివిధ కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో స్వర్ణభారతి విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసి దాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యత మెరుగుపరచుకోవాలన్నారు. ఈ జాబ్‌మేళాకు సుమారు 250 మంది హాజరయ్యారని తెలిపారు. ఈ జాబ్‌మేళాలో విప్రో, అమెజాన్, కాన్సెంట్రిక్, జొమాటో, విఎస్‌ఎస్, వివిధ కంపెనీలతో నిర్వహించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు సిహెచ్ రాము, మహేశ్వరి, నీలిమ, స్వర్ణ భారతి డిగ్రీ, జూనియర్, స్కూల్ ప్రిన్సిపాళ్లు సందీప్, జయ ప్రకాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిజిటల్ నిధులు దుర్వినియోగం

ప్రజాశక్తి- ఆమదాలవలస


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

డిజిటల్ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఎమ్మెల్యే కూన రవికుమార్ శుక్రవారం శాసనసభలో ప్రశ్నించారు. శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో ప్రభుత్వ నిధులను ఇష్టారాజ్యంగా వినియోగించారని, దీనిలో భాగంగానే యాత్ర టు సినిమా నిర్మాణానికి డిజిటల్ కార్పొరేషన్ నిధులు రూ.50 కోట్లు వినియోగించినట్లు విజిలెన్స్ విచారణలో వెల్లడైందన్నారు. తక్షణమే డిజిటల్ కార్పొరేషన్ నిధుల దుర్వినియోగంపై ప్రభుత్వం సిఐడి విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ప్రభుత్వ నిధులను ప్రజా అవసరాలకు కాకుండా దుర్వినియోగానికి పాల్పడిన వ్యక్తులపై, ఉద్యోగులపై విచారణలను సకాలంలో పూర్తిచేసి బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకునే విధంగా సంబంధిత అధికారులు మంత్రి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే రవికుమార్ స్పీకర్‌ను కోరారు.

డయల్ యువర్ డిఎం కార్యక్రమానికి స్పందన

ప్రజాశక్తి- పలాస

డయల్ యువర్ డిఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం ఆర్‌టిసి డిపో మేనేజర్ విఎస్ఎస్.నాయుడు నిర్వహించిన డయల్ యువర్ డిఎం కార్యక్రమానికి 10 వినతులు వచ్చాయని చెప్పారు. పాతపట్నానికి చెందిన నారాయణమూర్తి అనే ప్రయాణికుడు మాట్లాడుతూ పలాస నుంచి పార్వతీపురానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఇచ్ఛాపురం మండలం ఈదుపురం నుంచి విశాఖపట్నం వేకువజాము 4 గంటలకు బస్సు వేయాలని ఆ ప్రాంతానికి చెందిన మాలతి, అప్పారావు కోరారు. నువ్వలరేవు గ్రామం లోపలకు బస్సు రావడం లేదని, కిల్లోయి బస్సు సిబ్బంది ప్రవర్తన సక్రమంగా లేదని ప్రయాణీకులు ఫిర్యాదు చేశారు. సాయంత్రం, రాత్రి సోంపేట, ఇచ్ఛాపురానికి బస్సు వేయాలని ప్రయాణికులు కోరారు. రాజపురం నుంచి విశాఖపట్నం బస్సు సమయం మార్చాలని జ్యోతి, వజ్రపుకొత్తూరు మండలం హుకుంపేటకు చెందిన రామారావు మంచినీళ్ళపేటకు అదనపు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ప్రయాణికుల ఫిర్యాదులు పరిగణలోకి తీసుకొని వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సంతోష్‌కుమార్ పండా

మంత్రిని కలిసిన సంతోష్ పండా

ప్రజాశక్తి- మందస

సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ పండా కలిశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలో అభివృద్ధికి నోచుకోని గిరిజన ప్రాంతాల సమస్యలను ఈమె దృష్టికి తీసుకువెళ్ళారు. ముఖ్యంగా మందస మండలంలో అత్యధిక గిరిజన ప్రాంతాలు, పంచాయతీలున్నాయని వివరించారు. ప్రస్తుతం ఐటిడిఎ కార్యాలయం సీతంపేటలో ఉండి, అది పాలకొండ నియోజకవర్గ పరిధిలోకి, అరకు పార్లమెంట్ పరిధిలోకి వెళ్లిపోవడంతో జిల్లాకు పూర్తిగా ఐటిడిఎ లేకుండా పోయిందన్నారు. ఐటిడిఎను శ్రీకాకుళం జిల్లా మందస మండలానికి కేటాయించాలని వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన మంత్రి గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారని తెలిపారు.


వినతులు స్వీకరిస్తున్న ఎంపీ అప్పలనాయుడు

గ్రీవెన్స్‌లో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి- రణస్థలం

విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం ఎచ్చెర్ల నియోజకవర్గం, రణస్థలం ఎంపీ క్యాంపు కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్‌లో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలపై సంబంధించిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఎంపీ కలిశెట్టి దాతృత్వంతో వరుసగా మూడో సంతానం ఆడబిడ్డ అయితే సదరు ఆడబిడ్డ పేరిట రూ.50 వేలు ఇస్తున్న విషయం విధితమే. అందులో భాగంగా బొబ్బిలి నియోజకవర్గం తెర్లాం మండలం డి.గదభవలస గ్రామం నుంచి బొత్స ఝాన్సీరాణి అనే మహిళకు ముగ్గురు ఆడపిల్లల సంతానం కలరని ఎంపీ కార్యాలయానికి రాగా, గ్రీవెన్స్‌లో ఉన్న ఎంపీ వాళ్ళని పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఎరువుల తయారీపై అవగాహన

పలాస: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.మధు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు ఉద్యానవన మొక్కల విశిష్టత, వాటి పెంపకాన్ని ప్రోత్సహించడం, ఎరువుల తయారీపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ మొక్కల పెంపకం, వాటి లాభాలు, పర్యావరణంపై వాటి ప్రభావం వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఇళ్లలోని వ్యర్థ పదార్థాలతో ఎరువులు ఎలా తయారుచేయాలో విద్యార్థులకు కళాశాల ప్రాంగణంలో ఎరువులను ఎలా తయారు చేయాలో ప్రత్యక్షంగా చేసి చూపించారు. విద్యార్థులు వివిధ రకాల ఉద్యానవన మొక్కలను సేకరించి, వాటిని కళాశాల ఆవరణంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎల్ గణపతి, ఐక్యూఎసి కోఆర్డినేటర్ పి.వెంకటరమణ, సైన్స్ విభాగ అధ్యక్షులు ఎన్.శ్రీనివాస్ పట్నాయక్, లైబ్రేరియన్ బి నరసింహులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా పోటీలకు అమలపాడు విద్యార్థి ఎంపిక

వజ్రపుకొత్తూరు: అమలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఇఒ బి.వెంకటరమణ తెలిపారు. శుక్రవారం నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవం కోసం విద్యార్థులకు మండల స్థాయి వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తృత్వ పోటీల్లో అమలపాడు విద్యార్థిని డి.పి భాషిత మొదటి స్థానంలో, వ్యాసరచనలో వై.కుష్మిత మొదటి స్థానంలో నిలవగా చిత్ర లేఖనంలో డి.రేష్మ రెండోస్థానం కైవసం చేసుకుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులను జీవశాస్త్ర ఉపాధ్యాయుడు కూస వెంకటరమణ, హెచ్‌ఎం బి.వి.ఎస్ సాయిరాం, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఇఒ

మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు

ప్రజాశక్తి- కవిటి


కవిటి : రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శశిధర్

కుటుంబంలో మహిళ ఆరోగ్యంగా ఉంటేనే దేశం బలపడుతుందనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కవిటి మేజర్ పంచాయతీ సర్పంచ్ పూడి లక్ష్మణరావు, రాజపురం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ శశిధర్ తెలిపారు. 'స్వాస్థ్ నారీ – స్వశక్త్ పరివార్ అభియాన్' పేరుతో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. అందులో భాగంగా కవిటి సచివాలయంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ శశిధర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు (బీపీ, షుగర్, కేన్సర్ తదితరాలు) చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఇఒ ఎం.రవి, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జలుమూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ ఎం.సంధ్యారాణి ఆధ్వర్యంలో స్వశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా లింగాలవలసలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. మహిళలు, కిషోర బాలికలకు స్క్రీనింగ్, రక్త పోటు, కేన్సర్ తదితర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పొందూరు: మండలం కృష్ణాపురంలో తాడివలస పిహెచ్‌సి ఆధ్వర్యంలో సశక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 55 మందికి రక్తహీనత, బిపి, షుగర్ వంటి పలు రకాల పరీక్షలను జరిపి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి లఖినేని అనూష, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వరిలో చీడపీడల నివారణపై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస


పంటల పరిశీలనపై క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్న వ్యవసాయాధికారులు

వరి పంటలో చీడపీడల నివారణ మార్గాలపై జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వై.సురేష్ రైతులకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండలంలోని నిమ్మతొర్లాడలో వరిపంట పొలాల క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా ఖరీఫ్ 2025 సీజన్‌లో వరి పంటలో వచ్చే చీడపీడల పరిస్థితిని సమీక్షించేందుకు క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్నట్లు తెలిపారు. వరి పంటలో ప్రారంభ దశలోనే పంటపై పర్యవేక్షణ అవసరమని, పురుగు మందుల వాడకం కన్నా ముందు సహజ నియంత్రణ పద్ధతులను ఉపయోగించాలని తెలిపారు. చీడపీడలు ఎక్కువగా వ్యాప్తి చెందితేనే రసాయనిక మందులను సిఫార్సు చేయాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో రైతులు క్రమం తప్పకుండా పంటల పరిశీలన చేయాలని, ఆకుపచ్చ పురుగు తెగులు, ఎండు, రుగ్మతలు వంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్, రైతులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


ప్లాస్టిక్ వ్యర్థాలను చెత్త బుట్టలో వేస్తున్న విద్యార్థులు

ప్లాస్టిక్ వాడవద్దు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

స్థానిక సెయింట్ జూడ్స్ స్కూల్లో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పాఠశాల ను ప్లాస్టిక్ ఫ్రీ జోన్ గా మార్చేందుకు ప్రతి ఒక్క విద్యార్థీ సహకరించాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు కోరారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బుంగ చంద్రమోహన్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై శ్రద్ధ వహించాలని, వీలున్నంత వరకూ ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉండాలని కోరారు. తమ పాఠశాల విద్యార్థులలో కూడా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొం దించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థుల నుంచి ప్లాస్టిక్ సామగ్రిని మున్సిపల్ సిబ్బంది సేకరించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విశాఖ-బి కాలనీ ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధులు ఐ.శ్రీదేవి, ఎల్.లక్ష్మణరావు, కిరణ్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పలాస: విద్యుత్ నిర్వహణ పనులతో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తామని పలాస విద్యుత్ శాఖ ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలం బొడ్డపాడు సబ్‌స్టేషన్ పరిధిలోగల మాకన్నపల్లి, మామిడిపల్లి ఫీడర్లలో విద్యుత్ నిలుపుదల చేస్తామన్నారు. మర్రిపాడు, మామిడిపల్లి, మాకనపల్లి, నీలావతి, గురుదాసు పురం, కొబ్బరి చెట్లూరు, సుమ్మాదేవి, రంగోయి, అలాగే 11 కెవి విద్యుత్ మరమ్మతులు చేపట్టడం ద్వారా కాశీబుగ్గ సూది కొండ, పలాస విద్యుత్ శాఖ కార్యాలయం, హరి శంకర్ థియేటర్, సాయి కాలనీ, రోటరీ నగర్, లేబర్ కాలనీ, వివేకానంద కాలనీ, ప్రభుత్వ ఐటిఐ, మదర్ థెరీస్సా పాఠశాల సమీపం, సాయిబ్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సహకరించాలని కోరారు.

ఆత్మీయ సత్కారం

కవిటి: మండలంలోని శవసాన పుట్టుగ ప్రాథమిక పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీ అయిన జగదీష్, గౌతమి, భారతిని గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు ధనంజయ మజ్జి, సనపల రామకృష్ణ మాట్లాడుతూ విధి నిర్వహణలో బదిలీ ఓ భాగమని, ఉద్యోగికి తాము చేసిన సేవలే గుర్తింపునిస్తాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

ఆర్థికసాయం అందజేత

జలుమూరు: మండలం పోగోడు గ్రామానికి చెందిన ఎనర్జీ అసిస్టెంట్ మామిడి సురేష్ టెక్కలిపాడు గ్రామ వార్డు సచివాలయంలో విధి నిర్వహణలో భాగంగా ఇటీవల విద్యుత్ ప్రమాదానికి గురై మరణించారు. ఈ ఘటనపై స్పందించిన కోటబొమ్మాళి మండలం పరిధిలోని గ్రామవార్డు సచివాలయ సిబ్బంది ఎంపిడిఒ ఆధ్వర్యంలో మృతుని తల్లిదండ్రులకు శుక్రవారం రూ.70 వేలు ఆర్థికసాయం అందించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

కోటబొమ్మాళి: మండలంలోని పాకివలస, మెండపేట, పొన్నాడపేట, సాలిపేట, మామిడి వానిపేట, గురువెల్లిపేట, కిష్టుపురం, తర్లిపేట, కొత్తపల్లిలో గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. పశువైద్యాధికారులు డా. లఖినేని కిరణ్ కుమార్, డా. మెండ ప్రజ్ఞ చైతన్య ఆధ్వర్యంలో చౌదరి కొత్తూరు, హరిశ్చంద్రపురం, దంత, వెంకన్నపేట, బడపేట, చలమయ్యపేటలో పశుసంవర్థక శాఖ సిబ్బంది పాల్గొని 612 పశువులకు ఉచిత టీకాలు వేశారు.

ఒకేషనల్ కోర్సు వినియోగించుకోవాలి

సోంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న ఒకేషనల్ కోర్సులను విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని ఒకేషనల్ కోఆర్డినేటర్ గిన్ని శంకర్ కోరారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ కోర్సుల ఇన్‌స్ట్రక్టర్ల పనితీరును పరిశీ లించేందుకు శుక్రవారం పాఠశాలను సందర్శించారు. రికార్డులు, ల్యాబ్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చైతన్య, బి.సునీత, హెచ్‌ఎం మల్లేశ్వరరావు పాల్గొన్నారు.


గణిత దీప్తి స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు

గణిత దీప్తి విద్యార్థులకు ఉపయుక్తం

ఆమదాలవలస : గణిత దీప్తి పదో తరగతి విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.ఎ.రాములు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్‌మెటిక్స్ ఫోరం రూపొందించిన పదో తరగతి మ్యాథ్స్‌మెటిక్స్ స్టడీ మెటీరియల్ 'గణిత దీప్తి' ని విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గణిత దీప్తి స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు ఉపయో గించుకొని పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉన్నతంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గణితశాస్త్ర ఉపాధ్యాయులు షేక్ షావలి, తాండ్ర చంద్ర మనోహర్, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం పైల రవికుమార్, స్టాఫ్ సెక్రటరీ పైడి రామస్వామి నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారం పంపిణీ

రణస్థలం: మండలంలోని రణస్థలంలో సుపోషిత్ భారత్ సక్షం భారత్‌లో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులకు పోషకాహార వస్తువులను ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీనాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందని, వాటిని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి మజ్జి వెంకటరమణ, సూపర్‌వైజర్ శరణ్య, ప్రదీప్, సాయి, అంగన్వాడీ వర్కర్స్ అసిరి తల్లి, అనురాధ, భద్రమ్మ, కామేశ్వరి, రత్నాలు, ఎస్ విజయ , భద్రం, ఆశా వర్కర్లు పాపమ్మ , సత్యవతి, సరస్వతి, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భాను



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ కృష్ణ

నాబార్డు డిడిఎం సందర్శన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

బ్రెడ్స్ పరిధిలో గల నాబార్డ్ – జీవ ప్రాజెక్ట్ ఏరియాలో జిల్లా నాబార్డ్ డిడిఎం రమేష్ కృష్ణ శుక్రవారం పర్యటించారు. మండల పరిధిలో ఇల్లయ్యపురం, నెలబొంతు, మూల నెలబొంతు, అనంతగిరి, కొత్తపేట గ్రామాలను సందర్శించి జీవ ప్రాజెక్ట్ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. కొంతమంది రైతుల ప్లాట్స్‌కు వెళ్లి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఘన, ద్రవ జీవమృతం తయారీ, కోళ్ల పెంపకం, కూరగాయలు పంట వల్ల ఆదాయం, బయోరిసోర్స్ సెంటర్ వాడకంపై రైతులకు అడిగి సంతృప్తి చెందారు. గిరిజన రైతుల అభివృద్ధికి నాబార్డ్ ఎప్పుడు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో బ్రెడ్స్ ప్రెసిడెంట్ సాంబమూర్తి, జీవ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ జగన్నాథ బెహరా, జె.వి.రమణతో పాటు జీవ ప్రాజెక్ట్ రిసోర్స్ పర్సన్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్‌పి పాఠశాలకు కంప్యూటర్ వితరణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని మండపల్లి గ్రామ పంచాయతీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సర్పంచ్ పిట్టా శశిరేఖ కంప్యూటర్ వితరణ చేశారు. జెడ్‌పి పాఠశాలలో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడే కంప్యూటర్ వితరణ చేయడం సర్పంచ్ ఉదారతకు పలువురు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పిట్టా మామయ్య, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఎస్‌విజెలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- కవిటి

ఎస్‌విజె డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. డా. బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ ఎచెర్ల ఆదేశాల మేరకు ఎస్‌విజె డిగ్రీ యూనిట్–1, 2 వాలంటీర్లు ఈ శిబిరాన్ని చేపట్టారు. టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ వైద్యులు డా.సునీత, సిబ్బంది ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం జరిగింది. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో మొత్తం 25 యూనిట్ల రక్తం సేకరించారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌విజె మేనేజ్‌మెంట్ బివివి ప్రసాదరావు, బి.ఝాన్సీ, డా. సునీత, ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, ఎన్ఎస్ఎస్ పిఒ ఆర్.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాలు సందర్శన

సోంపేట: మండలంలో విక్రంపురం, జగతి కేశపురం గ్రామాల్లో శుక్రవారం రైతు సమావేశాలు, క్షేత్ర సందర్శనలు మండల వ్యవసాయ అధికారి బి.నరసింహమూర్తి, సోంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు టి.భవాని శంకరరావు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఈ దశలో వరికి వేయాల్సిన యూరియా మోతాదు, పొటాస్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. వరిలో పొటాస్, జింకు లోపం గుర్తించి రైతులకు సూచనలు చేశారు. యూరియాను ఈ నెలాఖరులోగా పంట దశలను బట్టి ఆయా గ్రామాలకు రైతు సేవా కేంద్రాల వద్దకు పంపిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జగనన్న కాలనీలో కార్డాన్‌సెర్చ్

ప్రజాశక్తి- పొందూరు

మేజర్ పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో ఎస్ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం కార్డాన్‌సెర్చ్ నిర్వహించారు. కాలనీలో ఇంటింటికీ వెళ్లి ద్విచక్ర వాహనాల అనుమతి పత్రాలను పరిశీలించారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కాలనీ వాసులకు సూచించారు. అనంతరం పొందూరు రైల్వేస్టేషన్, పరిసర దుకాణాల్లో గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాల విక్రయాలపై డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

ప్రజాశక్తి- కవిటి


అవగాహన కల్పిస్తున్న మల్లేశ్వరరావు

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యమని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ చెన్నూరు మల్లేశ్వరరావు అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా అంగీకార్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ 2019 – 24 మధ్య ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి, ప్రతి పేదవాడికి సొంత ఇల్లు కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. పథకంలో భాగంగా ఒక్క యూనిట్ విలువ రూ.2.50 లక్షలు ఉండగా, అందులో కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్రం రూ.1 లక్ష నిధులు అందజేస్తుందన్నారు. పేదలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రధానమంత్రి సూర్యఘర్ ముక్తి యోజన కింద ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తే కేంద్రం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. ఈ పథకం వల్ల విద్యుత్ బిల్లుల భారం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని, గ్రామాల్లో ట్రాన్స్‌కో అధికారులు పేర్ల నమోదు చేపడుతున్నారని ఆయన తెలిపారు.

పిల్లల చదువుపై బాధ్యత తీసుకోవాలి

లావేరు: మండలం బుడుమూరు ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం హెచ్‌ఎం ఆర్.పూర్ణచంద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. పిల్లల చదువుపై తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. రోజూ ఇచ్చిన హోం వర్క్ పిల్లలు పూర్తి చేసేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు ఎస్.కె.ప్రసాద్ కోరారు. చెడు అలవాట్లకు లోనుకాకుండా శ్రద్ధ తీసుకోవాలని జీవశాస్త్ర ఉపాధ్యాయులు పి.గోవిందరావు కోరారు. కొంత సమయాన్ని పిల్లల చదువుకు కేటాయించాలని, ఇంటివద్ద చదివించాలని ఉపాధ్యాయులు ఎం.అనురాధ, కె.వెంకటరావు, పి.తమ్మినాయుడు, కె.చిన పెంటయ్య, ఎస్.రమేష్ బాబు కోరారు.



లావేరు : మాట్లాడుతున్న హెచ్‌ఎం పూర్ణచంద్రరావు

సోంపేట: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఒరియా డిఐ దుర్గాప్రసాద్ చౌదరి, ఉపాధ్యాయులు ముప్పన ఈశ్వరరావు, చంద్రశేఖర్, బి.జానకిరావు, కామేశ్వరరావు, సుధం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానం నీటి పథకం ఉద్యోగులకు అండ

ఇచ్ఛాపురం: ఉద్దానం మంచి నీటి పథకం ప్రాజెక్ట్‌లో 1999 నుండి పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల్లో సుమారు 105 మందిని ముందస్తు నోటీసు ఇవ్వకుండా కేవలం ఒక వాట్సాప్ మెసేజ్ ద్వారా మీరు ఉద్యోగానికి రావద్దని చెప్పి తొలగించడం వలన రోడ్డున పడ్డ ఆయా కుటుంబాలకు అండగా నిలబడాలని మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కోరినట్లు మాజీ సీడ్ ఎపి చైర్మన్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. తాడేపల్లిలో జగన్ మోహన్ రెడ్డితో భేటీ. సందర్భంగా తొలగించిన ఉద్యోగులకు జరిగిన అన్యాయాన్ని జగన్ దృష్టికి తీసుకు రావడం జరిగిందన్నారు. దీనిపై జగన్ స్పందిస్తూ వారికి మద్దతుగా కోర్టు ద్వారా న్యాయ పోరాటం చేసేందుకు పార్టీ లీగల్ సెల్‌కు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు.


జగన్‌తో మాట్లాడుతున్న శ్యామ్ ప్రసాద్ రెడ్డి


విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జానకిరామ్

డ్రోన్ టెక్నాలజీపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

డ్రోన్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకిరామ్ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన డ్రోన్ టెక్నాలజీపై నిర్వహించిన వర్క్‌షాపు శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో వ్యవసాయం, వైద్యం, ఫోటో, వీడియో చిత్రీకరణ వంటి వాటిలో డ్రోన్ టెక్నాలజీ కీలకం కానుందని చెప్పారు. ఈ టెక్నాలజీలో ఉద్యోగ, ఉపాధి లభిస్తుందని అన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టిసారించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, సంస్థ రిసోర్స్‌పర్సన్ చైతన్య, మురళీకృష్ణ పాల్గొన్నారు.

దసరా సెలవులపై తొలగిన సందిగ్ధత

ప్రజాశక్తి- టెక్కలి

ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, పలు రంగాల విద్యాసంస్థల్లో దసరా సెలవులు నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు నిర్ణయం తీసుకుంది. ఈనెల 21 నుంచి నుంచి అక్టోబరు 2 వరకు దసరా సెలవులను ప్రకటించింది. విద్యాశాఖ కేలెండర్ ప్రకారం ఈ నెల 24 నుంచి అక్టోబర్ రెండు వరకు దసరా సెలవులు ఉంటాయని కేలెండర్‌లో ప్రకటించారు. అయితే ఆదివారం నుంచే మహాలయ అమావాస్య ప్రారంభం కావడంతో 21 నుంచి నుంచి దసరా సెలవులు మంజూరు చేయాలని పలు ఉపాధ్యాయ సంఘాలు విద్యాశాఖ అధికారులకు కోరారు. వీటిపై చివరి నిమిషంలో నిర్ణయం తీసుకున్న విద్యాశాఖ శుక్రవారం మధ్యాహ్నం దసరా సెలవులు మంజూరుపై స్పష్టత ఇచ్చింది.

రాయితీపై దాణా, పనిముట్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రైతులకు కావాల్సిన పశువుల దాణా, టార్పాలిన్లు, వ్యవసాయ అనుబంధ పనిముట్లు ఇండెంట్ ఇచ్చిన వెంటనే రాయితీ ధరల్లో అందించే ఏర్పాట్లు చేస్తున్నట్టు డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్ తెలిపారు. అరసవిల్లిలోని ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 69వ ప్రథమ మహాజన సభలో ఆయన మాట్లాడారు. సహకార సంఘాలు పరస్పరం తోడ్పాటు చేసుకుంటే వ్యాపారం విస్తరించి అదనపు ఆదాయం పొందగలమని సూచించారు. రైతులకు యూరియా సరఫరా కోసం ఇఫ్కో కంపెనీతో చర్చలు చేస్తున్నట్లు తెలిపారు. డిసిఎంఎస్ అభివృద్ధి దిశగా ఖాళీ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు, కన్వెన్షన్ హాల్స్ నిర్మించి అద్దెకు ఇవ్వాలని, ఆక్రమణలు నివారించేందుకు ప్రహరీ నిర్మాణం చేస్తున్నట్టు వివరించారు. సమావేశంలో డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ పాల్గొన్నారు.



శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీం సిబ్బంది

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

శ్రీకాకుళం సిటీ: శక్తి యాప్‌తో మహిళలు, విద్యార్థినులకు రక్షణ, భద్రత లభిస్తుందని, శక్తి యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ కావాలని శక్తి బృందాల పోలీసు సిబ్బంది తెలిపారు. శక్తి యాప్ ఆవశ్యకత, ప్రాధాన్యత గురించి శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ పట్టణ పరిధిలోని బస్ కాంప్లెక్స్, పాఠశాల, కళాశాలల వద్ద మహిళలు, విద్యార్థినులకు శుక్రవారం అవగాహన కల్పించారు. శక్తి యాప్ ప్రయోజనాలు, సేవలు వివరించారు. ఆపదలో ఉన్న ప్పుడు శక్తియాప్‌లో గానీ డయల్ 112 నంబ రుకు కాల్ చేస్తే పది నిమిషాల్లో పోలీసులు చేరుకుంటారని తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

పలాస: మండలం బ్రాహ్మణతర్ల శివ కాలనీకు చెందిన వడ్డీ కరెయ్య, నారాయణమ్మలకు ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితి బాగులేదు. విషయం తెలుసుకున్న బ్రాహ్మణతర్లా హెల్పింగ్ వారియర్స్ సభ్యులు రెండు నెలలకు సరిపడా రేషన్ సరుకులతో పాటు రూ.6,300 ఆర్థికసాయం అందజేశారు. స్వరాజ్, పి.గురునాథ్, గొల్ల శ్రీను, ఎన్.సోను, సార కుమార్, ఆళ్ల కృష్ణారావు, సల్ల గణేష్ పాల్గొన్నారు.